విక్రయాలకు వీలుగా..



మార్కెట్ నిర్మాణానికి గుర్తించిన ప్రభుత్వ స్థలం

- మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్‌తో రైతులకు భరోసా
- తాజాగా పాలకవర్గం కూడా నియామకం
- నిర్మాణాలకు మొదలైన స్థల సేకరణ

చింతకాని: చింతకాని, ముదిగొండ మండలాల రైతులు తమ పంట ఉత్పత్తులను విక్రయించుకునేందుకు పడుతున్న కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం కొత్త వ్యవసాయ మార్కెట్‌ను మంజూరు చేసింది. చింతకాని మండలం మత్కేపల్లిలో ఈ మార్కెట్ ఏర్పాటుచేస్తుండగా ఇప్పటికే పాలకవర్గాన్ని సైతం నియమించారు. అంతేకాక నిర్మాణాల కోసం ప్రభుత్వ స్థలాల గుర్తింపు ప్రక్రియ వేగంగా జరుగుతోంది. మధిర నియోజకవర్గంలోని మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ మండలాలకు కలిపి మధిరలో మాత్రమే వ్యవసాయ మార్కెట్ ఉంది. ఈ మార్కెట్‌కు మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాల రైతులు, చింతకాని, ముదిగొండ మండలాల రైతులు ఖమ్మం, నేలకొండపల్లి మార్కెట్లకు వెళ్తున్నారు. ఈ రెండు మండలాల రైతుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క చొరవతో మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ మంజూరైంది.

రైతుల కష్టాలకు చెక్

మత్కేపల్లిలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుతో చింతకాని, ముదిగొండ రైతులకు మేలు జరుగుతుంది. ఖమ్మం మార్కెట్ పరిధిలోని చింతకాని, నేలకొండపల్లి మార్కెట్ పరిధిలో ఉన్న ముదిగొండ మండల రైతుల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు వీలుగా మత్కేపల్లి మార్కెట్ అందుబాటులోకి వస్తోంది. ఈ మార్కెట్‌ను ఏర్పాటుచేస్తూ ఆగస్టు 2వ తేదీన ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఇక మార్కెట్‌కు సంబంధించి కార్యాలయం, షెడ్లు, అంతర్గత రహదారులు, గోదాంలు, వే బ్రిడ్జి నిర్మాణానికి ఇరవై ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని మార్కెటింగ్ అధికారులు చింతకాని తహసీల్దార్‌కు సూచించారు. దీంతో అధికారులు మత్కేపల్లి రెవెన్యూ పరిధి 41వ సర్వే నంబర్‌లోని ఎనిమిది ఎకరాల స్థలాన్ని ఇప్పటికే గుర్తించి ఆర్డీఓకు నివేదించారు. మిగిలిన భూమిని కూడా గుర్తించి నిర్మాణాలు చేపడితే చింతకాని, ముదిగొండ మండలాల రైతులకు మేలు జరగనుంది.

నూతన పాలకవర్గం నియామకం

మార్కెట్‌కు చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు 18మంది సభ్యులతో నూతన పాలకవర్గాన్ని ప్రభుత్వం గత నెల 27న ప్రకటించింది. చైర్మన్‌గా కాంగ్రెస్ చింతకాని మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా ముదిగొండ మండల కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు పర్సగాని తిరుపతిరావు నియమితులయ్యారు. ఇప్పటికే పాలకవర్గం బాధ్యతలు స్వీకరించింది.

మా ఇబ్బందులు తీరినట్టే..



మత్కేపల్లి మార్కెట్ అందుబాటులోకి వస్తే మా ప్రాంత రైతుల ఇబ్బందులు తీరతాయి. ఇకపై పంటల అమ్మకానికి ఖమ్మం మార్కెట్‌కు వెళ్లాల్సిన అవసరం రాదు. తద్వారా రవాణా ఖర్చులు తగ్గుతాయి. మత్కేపల్లి మార్కెట్‌ను అన్ని రకాల సౌకర్యాలతో నిర్మించాలి.

– నర్సింశెట్టి లక్ష్మీనారాయణ, మత్కేపల్లి, చింతకాని మండలం

నిర్మాణాలు త్వరగా చేపట్టాలి



వ్యవసాయ నిర్మాణ పనులను త్వరగా చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలి. మత్కేపల్లి మార్కెట్ మంజూరుతో మా ప్రాంత రైతులకు మేలు జరుగుతుంది. ఇప్పటివరకు ఇబ్బందులు నడుమ పంట ఉత్పత్తులను నేలకొండపల్లి మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్మాల్సి వస్తోంది.

– ఏలూరి హన్మంతరావు, పమ్మి, ముదిగొండ మండలం

రైతుల అభ్యున్నతికి కృషి



చింతకాని, ముదిగొండ మండలాల రైతుల సౌలభ్యం కోసం ప్రభుత్వం మత్కేపల్లి కేంద్రంగా వ్యవసాయ మార్కెట్‌ను మంజూరు చేసింది. ఈ మార్కెట్ ఏర్పాటుతో రెండు మండలాల రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా కృషి చేస్తాం.

– అంబటి వెంకటేశ్వరరావు, మార్కెట్ చైర్మన్

భవన నిర్మాణాలకు ప్రణాళిక



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

కల్లూరురూరల్: డివిజన్ కేంద్రమైన కల్లూరులో ప్రభుత్వ కార్యాలయాల సమీకృత భవన నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ప్రస్తుతం కార్యాలయాలు వివిధ ప్రాంతాల్లో కొనసాగుతుండగా అన్నింటినీ ఒకే చోటకు చేర్చేలా సమీకృత భవనం నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు సిద్ధం చేసిన నమూనాల మ్యాప్‌ను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం పరిశీలించారు. కల్లూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్‌తో సమావేశమైన ఆయన మ్యాప్‌పై చర్చించారు. అలాగే, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హామీ మేరకు కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాస్టల్ ఏర్పాటుపై వివరాలు ఆరా తీశారు. తహసీల్దార్ పులి సాంబశివుడు, గిర్దావర్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా నాయకులనే గెలిపించండి..



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సత్తుపల్లిరూరల్: ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకులనే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించుకోవాలని ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు తాటి రాజు అధ్యక్షతన మండలంలోని సత్యంపేటలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థలకు వచ్చే నిధులను సక్రమంగా వినియోగిస్తేనే పల్లెలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించే ప్రజాపంథా నాయకులను గెలిపించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కాగా, సత్తుపల్లి జెడ్పీటీసీగా తాటి దేవి, రుద్రాక్షపల్లి ఎంపీటీసీగా ఒగ్గు నాగిరెడ్డి, సర్పంచ్‌గా గంటా శ్రీనివాసరావు, కాకర్లపల్లి ఎంపీటీసీగా బొజ్జా విశ్వనాథం, సర్పంచ్‌గా నడికుదురు భాస్కర్‌రావు పార్టీ అభ్యర్థులుగా పోటీలో ఉంటారని తెలిపారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఏ.వెంకన్న, నాయకులు గంటా శ్రీనివాసరావు, లాజరు, అమర్లపూడి శరత్, కొర్సా వెంకటేశ్వరరావు, ఒగ్గు నాగిరెడ్డి, దుంపా రాఘవులు, నాగ ప్రసాద్, తాటి దేవి పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి నిరసన



మధిర : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

సత్తుపల్లి/మధిర: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నాన్ని నిరసిస్తూ సీపీఎం నాయకులు బుధవారం సత్తుపల్లి మండలంలో గంగారంలో ఆందోళన చేపట్టారు. పార్టీ నాయకుడు జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని, బీజేపీ ప్రభుత్వం అండతోనే ఇలాంటి దాడులు జరుగుతున్నాయని తెలిపారు. నాయకులు బాల బుచ్చయ్య, సందరావు, కృష్ణ, రఘు, వెంకటేశ్వరరావు, భాగ్యమ్మ, రామారావు పాల్గొన్నారు. అలాగే, సీజేఐపై దాడికి యత్నించిన రాకేష్ కిషోర్ దిష్టిబొమ్మను మధిరలో సీపీఎం నాయకులు దహనం చేశారు. నాయకులు శీలం నరసింహారావు, మందా సైదులు మాట్లాడుతూ దాడులకు పాల్పడుతున్న అసాంఘిక శక్తులను కఠినంగా శిక్షించాలని కోరారు. నాయకులు పాపినేని రామనరసయ్య, తాళ్లూరి ఆంజనేయులు, మీరాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు



ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు, విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: వన్యప్రాణులను వేటాడే వారిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సత్తుపల్లి రేంజర్ పి.స్నేహలత హెచ్చరించారు. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం సత్తుపల్లిలో తెలంగాణ మైనార్టీ పాఠశాల విద్యార్థులతో కలిసి జంతువుల వేషధారణతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వన్యప్రాణులు, అడవుల సంరక్షణను అందరూ బాధ్యతగా భావించాలని సూచించారు. ఎఫ్‌ఎస్‌ఓ నర్సింహ, మైనార్టీ పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్రామయ్య, వైల్డ్‌లైఫ్ ఎక్స్‌పర్ట్ దీపక్, అటవీశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

వరి పొలాలను పరిశీలించిన ఏఓ



వరి పొలంలో పరిశీలిస్తున్న ఏఓ, తదితరులు

ఏన్కూరు: మండలంలోని ఆరికాయలపాడు, కేసుపల్లిల్లో వరి పొలాలను మండల వ్యవసాయాధికారి ఏ నరసింహారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నిచోట్ల ఎండు తెగులును గుర్తించామని తెలిపారు. దీని నివారణకు నత్రజని ఎరువులు వేయడం తగ్గించి ప్లాంటోమైసిన్ 0.2 గ్రాములు, కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములును లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే, పత్తిని సీసీఐ కేంద్రాల్లో అమ్మడానికి యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఏఈఓ బి.భవ్య, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి వద్ద బుధవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. చిన్నమండవ గ్రామానికి చెందిన పర్సగాని నాగేశ్వరరావు, తన కుమారుడు రాంప్రసాద్‌ను రఘునాథపాలెంలోని బీసీ బాలుర వసతి గృహంలో చేర్పించేందుకు తీసుకెళ్తున్నాడు. ఈక్రమంలో పందిళ్లపల్లి వద్ద కోతుల గుంపు రోడ్డు అడ్డుగా రావడంతో తప్పించే క్రమాన వాహనం అదుపు తప్పగా కిందపడ్డారు. ఈ ఘటనలో గాయపడిన నాగేశ్వరరావు, రాంప్రసాద్‌ను 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత



పెద్దమండవలో ట్రాక్టర్ల వద్ద గ్రామస్తులు

ముదిగొండ: మండలంలోని పెద్దమండవ మీదుగా ఇసుక తరలిస్తు న్న ట్రాక్టర్లను గ్రామస్తులు బుధవా రం అడ్డుకున్నారు. ము న్నేటి నుంచి పెద్దమండవ మీదుగా నిరంత రం పెద్దసంఖ్యలో ఇసుక ట్రాక్టర్లు వెళ్తుండడంతో దుమ్ము,ధూళి కారణంగా ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు ఆరోపించారు. అంతేకాక ట్రాక్టర్ల వేగంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇకనైనా ట్రాక్టర్ల వేగానికి అధికారులు అడ్డుకట్ట వేయాలని గ్రా మస్తులుకోరారు.అనంతరంఅధికారులకు సమాచారం ఇచ్చిట్రాక్టర్లను వదిలేశారు.

ఎన్నికల విధుల్లో లోటుపాట్లు ఉండొద్దు



వైరా : శిక్షణలో మాట్లాడుతున్న ట్రెయినర్ సత్యనారాయణ



ముదిగొండ : శిక్షణ ఇస్తున్న ఆర్‌ఓ మహేష్‌బాబు



కల్లూరురూరల్: శిక్షణను పర్యవేక్షిస్తున్న సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్

ఉద్యోగుల శిక్షణలో అధికారులు

వైరా/ఏన్కూరు/కారేపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యాన విధులు నిర్వర్తించే ఉద్యోగులు ఎలాంటి లోటుపాట్లు ఎదురుకాకుండా చూడాలని వైరా మండల రిటర్నింగ్ అధికారి బాబూరావు సూచించారు. మండలంలో ఎంపిక చేసిన ఉద్యోగులకు బుధవారం శిక్షణ ఇవ్వగా ఆయనతో పాటు ట్రెయినర్ సత్యనారాయణ మాట్లాడారు. తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్, ఎంపీడీఓ సక్రియానాయక్, ఎంఈఓ కె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే, ఏన్కూరులో జరిగిన శిక్షణలో మండల ప్రత్యేకాధికారి రామకోటి, ఎంపీడీఓ రంజిత్‌కుమార్, తహసీల్దార్ శేషగిరిరావు, కారేపల్లిలో ఇచ్చిన శిక్షణలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహశీల్దార్ రమేష్, ఎంపీఓ రవీంద్రప్రసాద్, సూపరింటెండెంట్ రమేష్ పాల్గొన్నారు.

ముదిగొండ/ఎర్రుపాలెం/బోనకల్: ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని అధికారులు సూచించారు. ముదిగొండలో ఇచ్చిన శిక్షణలో రిటర్నింగ్ అధికారి మహేష్‌బాబు మాట్లాడగా ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, తహసీల్దార్ సునీత ఎలిజబెత్, ఎంపీఓ వాల్మీకి కిషోర్, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ భాస్కర్‌రావు పాల్గొన్నారు. ఎర్రుపాలెంలో ఇచ్చిన శిక్షణలో ఎంపీడీఓ సురేందర్ సూచనలు చేయగా, బోనకల్‌లో మండల ప్రత్యేకాధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ రమాదేవి మాట్లాడారు.

వేంసూరు/తల్లాడ/కల్లూరు రూరల్/సత్తుపల్లి రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై బుధవారం ఉద్యోగులకు వేంసూరులో శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ రాజారావు, తహసీల్దార్ మాణిక్‌రావు పాల్గొన్నారు. తల్లాడలో ఇచ్చిన శిక్షణలో పీఓటీ హరిబాబు మాట్లాడగా మండల ప్రత్యేకాధికారి శివప్రసాద్, ఎంపీడీఓ సురేష్‌బాబు, తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి హాజరయ్యారు. సత్తుపల్లి, కల్లూరులో ఇచ్చిన శిక్షణలో విధులపై ఎంపీడీఓలు నాగేశ్వరరావు, చంద్రశేఖర్, ట్రెయినర్లు మధుసూదన్‌రావు, సుదర్శన్, ఏఈ పుష్పలత అవగాహన కల్పించారు. తహసీల్దార్లు సత్యనారాయణ, ఎంపీఓ కృష్ణ పాల్గొనగా కల్లూరులో శిక్షణను సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్ పర్యవేక్షించారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారం



మాట్లాడుతున్న కమిషనర్ గురులింగం

వైరా: వైరా మున్సిపాలిటీలో వివిధ కారణాలతో పెండింగ్ ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి దరఖాస్తుదారులు ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ యు.గురులింగం సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఇటికల భాస్కర్, శానిటేషన్ ఆఫీసర్ వీరన్నతో కలిసి మాట్లాడారు. మొత్తం 3,532 దరఖాస్తులకు గాను 725 మంది ఫీజు చెల్లించగా 494 దరఖాస్తులు పరిష్కరించామని తెలిపారు. మిగతావారు కూడా సరైన పత్రాలు సమర్పించాలని చెప్పారు. కాగా, ఇప్పటి వరకు ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా రూ2.35కోట్ల లక్షల ఆదాయం సమకూరిందని తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యాన్ని ఆటోలో తరలిస్తున్న అధికారులు

వైరా: అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సంయుక్త తనిఖీ ల్లో స్వాధీనం చేసుకున్నారు. వైరా కూరగాయల మార్కెట్ రోడ్డులోని ఓ ఇంట్లో నిల్వచేసిన 3.30 క్వింటాళ్ల రేషన్‌బియ్యంతో పాటు, ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 1.40 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. తనిఖీల్లో వైరా ఎస్‌ఐ పి.రామారావు, ట్రెయినీ ఎస్‌ఐ పవన్, ఆర్‌ఐలు నవీన్, రఘు పాల్గొనగా, రేచర్ల వెంకటేశ్వర్లు, సైదులుపై కేసు నమోదు చేశారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



ఖలీమ్ కుటుంబీకులకు నగదు అందిస్తున్న స్నేహితులు

కారేపల్లి: పదో తరగతి వరకు కలిసి చదువుతున్న వ్యక్తి కుటుంబానికి ఆయన స్నేహితులు రూ.30వేల ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని పేరుపల్లికి చెందిన షేక్ ఖలీమ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనతో కలిసి కారేపల్లి హైస్కూల్‌లో చదివిన 1993 బ్యాచ్ విద్యార్థులు రూ.30వేలు సేకరించారు. ఈమేరకు బుధవారం ఆయన కుటుంబానికి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో కందుల ప్రసాద్, సాగర్, రాంబాబు, లక్ష్మణ్, శంకర్, భీమవరపు రవి, సీహెచ్.రమేష్, సామినేని రవి, దిండిగల రవి, ఎల్లంకి పిచ్చయ్య, వేములూరి వీరభద్రచారి, పులకాని దేవేందర్‌రెడ్డి, గిరివర్ధన్‌చారి పాల్గొన్నారు.



శంకుస్థాపనతోనే సరి..

కంకర పోసి వదిలేసిన నాయకులగూడెం రోడ్డు

- రూ.కోటి నిధులతో రోడ్డు నిర్మాణానికి శ్రీకారం
- పది నెలలైనా పూర్తికాక గ్రామస్తుల ఇబ్బందులు

వేంసూరు: ఏళ్లుగా మామిడి తోటల మధ్యలో గుంతల పడిన మట్టి రోడ్డుపై మండలంలోని చిన్నమల్లెల పంచాయతీ పరిధి నాయకులగూడెం గ్రామస్తులు ఇబ్బందులు నడుమ రాకపోకలు సాగిస్తున్నారు. ఈమేరకు ఏడాది క్రితం భీరపల్లి ప్రధాన రహదారి నుంచి నాయకులగూడెం వరకు పంచాయతీరాజ్ శాఖ రూ.కోటి నిధులతో బీటీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ పనులకు గతేడాది డిసెంబర్‌లో ఎమ్మెల్యే మట్టా రాగమయి శంకుస్థాపన చేయగా.. పది నెలలు దాటినప్పటికీ రోడ్డు నిర్మాణం పూర్తికాలేదు. దీంతో రహదారి అందుబాటులోకి వస్తుందని ఆశించిన నాయకులగూడెం గ్రామస్తులు తమ కష్టాలు ఎప్పటికీ తీరుతాయోనని ఎదురుచూస్తున్నారు.

కంకర పరిచి.. వదిలేసి

భీరపల్లి ప్రధాన రహదారి నుంచి నాయకులగూడెం వరకు రహదారి పనులను శంకుస్థాపన చేయగానే గ్రామస్తులు ఆనందించారు. మట్టి రోడ్డుపై గుంతల్లో ఇబ్బందుల నడుమ రాకపోకలు సాగిస్తున్న తాము కష్టాల నుంచి గట్టెక్కినట్లేనని భావించారు. కానీ పది నెలలుగా రోడ్డు నిర్మాణం పూర్తికాలేదు. హడావుడిగా రోడ్డు పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టర్ గతంలో ఉన్న మట్టి రోడ్డుపై కంకరు పరిచి వదిలేశారు. ఆతర్వాత పనులు సాగకపోవడంతో గ్రామస్తులు ప్రయాణం ఇంకా ఇబ్బందుల మధ్యే సాగుతోంది. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.

వర్షాలు తగ్గిన వెంటనే పనులు

ప్రస్తుతం వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా పనులు ఆలస్యమయ్యాయి. వర్షాలు తగ్గిన వెంటనే పనులు మొదలు పెడతాం. గ్రామస్తులకు ఇబ్బంది ఎదురుకాకుండా త్వరగా రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా పర్యవేక్షిస్తాం.

– సాయికృష్ణ, పీఆర్ ఏఈ

క్లుప్తంగా

పరిశుభ్రత పాటించండి..

సత్తుపల్లిరూరల్: ప్రతీ ఉద్యోగి తన ఇంటితో పాటు పని స్థలాలను సైతం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సింగరేణి సత్తుపల్లి జేవీఆర్ ఓసీ పీఓ ప్రహ్లాద్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం జేవీఆర్ ఓసీలో ఉద్యోగులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. ఇంజనీర్ శ్రీనివాసరావు, రాజేశ్వరరావు, కల్యాణ్‌రామ్, దేవదాస్, నర్సింహారావు, రామారావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఉపకరణాలు



ఉపకరణాలు అందజేస్తున్న ప్రతినిధులు

కొణిజర్ల: రాంకీ ఫౌండేషన్, ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యాన మండలంలోని తనికెళ్ల, తుమ్మలపల్లి జీపీల పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం ఉపకరణాలు అందజేశారు. ఎస్‌బీఐ సంజీవని క్లినిక్ ఆన్ వీల్స్ ప్రాజెక్ట్‌లో భాగంగా కార్మికులకు బూట్లు, గ్లౌజులు, సేఫ్టీ జాకెట్లు పంపిణీ చేశారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

మధిర: మండలంలోని దెందుకూరులో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ గ్రామ కార్యాలయాన్ని బుధవారం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ప్రారంభించారు. కార్యాలయ ఏర్పాటుకు కృషి చేసిన సొసైటీ అధ్యక్షుడు కోట వెంకటకృష్ణను అభినందించారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యాన జరుగుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురానికి చెందిన గుడిపాటి పవన్(23) ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ కలహాల కారణంగా ఈనెల 4వ తేదీన పురుగుల మందు తాగిన ఆయనను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందగా పవన్ తల్లి యశోద ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై వీరేందర్ తెలిపారు.

లోన్ పేరిట రూ.34 వేలు స్వాహా

పెనుబల్లి: రుణం ఇప్పిస్తామంటూ నమ్మబలికిన వ్యక్తులు రూ.34 వేలు స్వాహా చేసిన ఘటన ఇది. పెనుబల్లి మండలం ఉప్పలచిలకకు చెందిన సురటి చరణ్‌కు ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తులు రుణం ఇస్తామని చెప్పారు. అయితే, సిబిల్ స్కోర్ తక్కువ ఉందని చెబుతూ నమ్మించి రూ.34 వేలు జమ చేయించుకున్నారు. ఆతర్వాత ముఖం చాటేయడంతో అనుమానం వచ్చిన చరణ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించండి

కొణిజర్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల పక్షాన పోరాడే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యుడు తాళ్లపల్లి కృష్ణ కోరారు. కొణిజర్లలో బుధవారం బోయినపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో కలిసి వచ్చే వామపక్ష, లౌకిక పార్టీలతో సీట్ల సర్దుబాటు చేసుకుంటామని తెలిపారు. మండలంలోని ఎనిమిది ఎంపీటీసీ స్థానాలతో పాటు జెడ్పీటీసీ స్థానానికి పోటీ చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. సీపీఎం మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, నాయకులు కొప్పుల కృష్ణయ్య, మోత్కూరి వెంకయ్య, పుల్లూరి వెంకటేశ్వర్లు, చింతపల్లి ప్రసాద్, తాళ్లపల్లి విజయ, హరిచంద్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గంలో స్థానం



సుదర్శన్ మిశ్రా



రాఘవరావు

సత్తుపల్లిటౌన్: ఇటీవల ప్రకటించిన బీజేపీ జిల్లా కార్యవర్గంలో సత్తుపల్లి నాయకులకు స్థానం దక్కింది. జిల్లా ఉపాధ్యక్షుడిగా సుదర్శన్ మిశ్రా, ప్రధాన కార్యదర్శిగా నాయుడు రాఘవరావు నియమితులయ్యారు. వీరిని బుధవారం సత్తుపల్లిలో నాయకులు అభినందించారు. నాయకులు పాలకొల్లు శ్రీనివాస్, మంద శివయాదవ్, కార్తీక్ యాదవ్, బట్టి సాయియాదవ్ పాల్గొన్నారు.